# పుస్తక పరిచయం




**కవి, రచయిత** ఉండవల్లి.ఎమ్‌గారి కథా సంపుటి ఈ 'అంకితం'. ఇందులో 18 కథలున్నాయి. దాదాపు ఈ కథలన్నీ ప్రముఖపత్రికల్లో ప్రచురితమైనవే. ప్రతి కథ మొదటినుంచి చివరివరకూ ఆసక్తికరంగా చదివిస్తుంది. కారణం - సరళమైన శైలి, ఎంపిక చేసుకున్న కథాంశాలూ, ముఖ్యంగా కథ చెప్పే విధానం. వైవిధ్యభరితమైన కథాంశాలే అన్నీ. ఒక కథకూ ఇంకో కథకూ సామ్యం ఉండదు.

మొదటి కథ 'అమ్మ' - చాలా చిన్నప్పుడు అతిచిన్న విషయానికి అమ్మపై కోపం తెచ్చుకుని, ఇంట్లోంచి పారిపోయిన కుర్రాడు, చాలారోజుల తర్వాత ఊరికి తిరిగి వస్తే అతడికి ఎదురైన అనుభవాలు - ఈ కథలోని సన్నివేశాలు. వాక్యనిర్మాణంలో కవితా శైలి కనిపిస్తుంది. "నన్ను చూసి కళ్ళనీళ్ళు తెచ్చుకుని, మా ఊరెనుక సెలయేటి నీరయింది, మా అమ్మరాకకు ముందే ఊర్ని చూసి నా గుండె గోదారయింది, మనిషి క్రమంగా ఆస్వాదించగల మార్పుని ఒక్కసారే అనుభవిస్తే గుండెపగిలి చస్తాడు' ఇలాంటి వాక్యాలు సున్నితంగా మనసుల్ని తాకుతాయి. కథల్లో సంభాషణలు, పాత్రచిత్రణా, రచయిత నెరేషన్ సమపాళ్ళలో సాగుతూ కుప్తతలో ఉన్న అందానికి అద్దం పడతాయి. 'రహస్య స్నేహితుడు' అనుకోని ముగింపు పాఠకుడ్ని ఒక కుదుపు కుదుపుతుంది. ఆధునిక సాంకేతికత, అంతర్జాల జీవితాలు, సెల్ ఫోన్ సంఘటనలు - వీటి చుట్టూ అల్లిన కథల్లోనూ ఏదో ఒక వినూత్నత కనిపిస్తూ రచయిత ప్రత్యేకతకు అద్దం పడతాయి. వేశ్యాజీవితాలు కథాంశాలుగా చాలా కథలు చదివాం కానీ 'అంకితం' కథ మరో కొత్త కోణాన్నీ, సరికొత్త ముగింపునీ పాఠకుడు ముందుంచుతుంది. అతి స్వల్ప వాక్యాలతో, ఎక్కడా గంభీరమైన పదప్రయోగాలు లేకుండా కథలోని వాతావరణంలోకి పాఠకుడ్ని తీసుకెళ్ళడంలో రచయిత చాలా పరిణితి చూపించారు.

చకచకా సాగుతూ, ఎక్కడా విసురానివ్వకుండా చదివిస్తాయా కథలన్నీ. ఏ కథా కేవలం వ్రాయడం కోసం వ్రాసినట్లు కానీ, ఊసుపోక వ్రాసినట్లు కానీ అనిపించవు. ప్రతికథలోనూ ఆలోచన ఉంది, సందేశం కాకపోయినా ఒక చక్కటి దృశ్యసంకలనాన్ని పాఠకుడి ముందు ఉంచాలన్న తపన కనిపిస్తుంది. ఈ విషయంలో రచయిత విజయవంతం అయ్యారని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. అందమైన ముద్రణా, ప్రతి కథకూ బాలిగారి వర్ణచిత్రాలూ ఈ పుస్తకానికి అదనపు విలువలుగా నిలిచాయి. పుస్తకం అంతా చదవడం పూర్తయ్యాక అనేకమంది మంచిమనుషులతో సంభాషించిన అనుభూతి కలుగుతుంది.

★★★

**Undavilli.M**
*# 23-7-20, Plot no.305,*
*Sri Bhanu Apartments*
*Duggiralavari St.,Frazerpeta*
*Kakinada-533 001, E.G. Dt.*
*Mobile - 94413 47679*




డా.భీంపల్లి శ్రీకాంత్
ఇ.నెం. 8-5-38
టీచర్స్ కాలనీ- మహబూబ్ నగర్
ఫోన్: 903 284 4017

డా.భీంపల్లి శ్రీకాంత్ పేరు ఆధునిక వచన కవితాలోకానికి చిరపరిచితమే. వచనకవితలో ముఖ్యంగా మినీ కవితా ప్రక్రియలో అద్భుతమైన ప్రయోగాలు చేసిన యువకవి, నవకవి డా.భీంపల్లి శ్రీకాంత్‌గారు. మూడేళ్ళ క్రిందట 'మొగ్గలు' అనే వినూత్న మినీకవితా ప్రక్రియకు బీజం వేసి, ప్రక్రియలో అనేక మందిని ఆ మొగ్గలబాటలో నడిపిస్తున్న కవితా మార్గదర్శి. ఆయన ప్రారంభించిన 'మొగ్గలు' ప్రక్రియలో స్వయంగా 'మొగ్గలు',' బతుకమ్మ మొగ్గలు' అనే కవితా సంపుటలను వెలువరించారు. అదే మార్గంలో సహరచయితలు ఉప్పరి తిరుమలేశ్ 'చిరుమొగ్గలు',' బతుకమ్మమొగ్గలు', బోలయాదయ్య 'మట్టి మొగ్గలు',' సత్యనీలిమ 'ఆదిశక్తి మొగ్గలు'.. ఇలా అనేక కవితాసంపుటాల్ని వెలువరించారు. సహస్రాధిక కవితలు ఈ ' మొగ్గలు' ప్రక్రియలో రావడం ఆ ప్రక్రియకున్న ఆకర్షణకు నిదర్శనం. అదే కోవలో డా.భీంపల్లి శ్రీకాంత్‌గారు ప్రచురించిన తాజా కవితా సంపుటి ఈ 'ప్రేమ మొగ్గలు'. ఇవి మూడు పాదాల మినీ కవితలు. పుస్తకం శీర్షికను బట్టి ఈ కవితల్లోని వస్తువును తేలికగా ఊహించవచ్చు. ఇందులోని కవితలన్నీ 'ప్రేమ' చుట్టూ తిరిగేవే, ప్రేమ ఆధారంగా నడిచేవే. ఇందులోని కొన్ని 'ప్రేమ మొగ్గలు'.. – నీ జ్ఞాపకాల ఊసుల్లో కొట్టుకు పోతున్నా / ఆకులు రాలిన కాలంలా మన ప్రేమాయణం / నులివెచ్చని తియ్యని జ్ఞాపకం మన ప్రేమ ; అనుక్షణం నా కళ్ళలోకి తొంగిచూస్తూనే / ముసిముసినవ్వులతో మాయలెన్నో చేస్తుంటావు / నువ్వే కదా నా ప్రేమ జీవితానికి అపురూపకానుక ; నీ వాగ్దానం కోసమే పిచ్చోడిలా జీవిస్తూనే / నీకై నా యావత్ జీవితాన్ని అర్పించాను / ప్రాణాలను సైతం లెక్కచేయనిది ప్రేమ.. ఇలా సాగే ఈ కవితల్లో అనేక వినూత్న పదప్రయోగాలు చేశారు. 'అందంగా నవ్వుతూ నాలో ఆశలు రేపుతూనే / అడుగడుగునా ఆశలెన్నో చిగురింపజేస్తుంటావు – ఈ 'మొగ్గ' లో ఆశలు రేపుతూనే ఆశలు చిగురింపచేయడమనేది శ్రీకాంత్‌గారు వ్యక్తీకరించిన వినూత్న భావన. అలానే 'నీ ఆగమనానికై తనువు వేచిచూస్తున్నప్పుడల్లా / చకోరపక్షినై ఎదురుచూస్తూ కలకంటూనే ఉంటాను ' – ఈ 'మొగ్గలో' 'వేచిచూస్తున్నప్పుడల్లా ఎదురు చూస్తూ' అనడం కూడా కవి సొంత శైలికి ఓ సంతకం. ఒకే కవితలో ప్రేమ సరస్సులో కొట్టుకుపోతూనే ప్రేమనదిలో హాయిగా పయనించడం ' ' నవ్వుల జలపాతంలో తడిసిపోవాలనుకున్నప్పుడు చిరుదరహాసంతో మదిని దోచెయ్యడం' ' ఉచ్ఛ్వాసనిశ్వాసలు ఊపిరి' కావడం .. లాంటి విలక్షణ ప్రయోగాలు ఈ 'ప్రేమ మొగ్గలు' నిండా కనిపిస్తాయి. డా.భీంపల్లి శ్రీకాంత్ గారి కలం నుంచి మరిన్ని విలక్షణమైన 'మొగ్గలు' విరబూస్తాయని ఆశిద్దాం. ★★★

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

Editor,
KOUMUDI (Web Monthly)
4251 - Escudo Ct
Dublin - CA 94568, USA